క్లుప్తంగా

దాసరి రామును పరామర్శించిన అంబటి



కొరిటిపాడు: పట్టణంలో కాపు, ఒంటరి, తెలగ, బలిజ జేఏసీ అధ్యక్షుడు దాసరి రాము కుమార్తె అనారోగ్యం కారణంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. దాసరి రామును పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్‌ఐలు



నగరంపాలెం: విధులు సమర్థంగా నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. ఏఎస్‌ఐల నుంచి ఎస్‌ఐలుగా ఉద్యోగోన్నతి పొందిన మురళీధర్‌రావు (ఎస్పీఎస్ నెల్లూరు జిల్లా), శ్రీనివాసరావు, అంజిరెడ్డి (ప్రకాశం జిల్లా) గుంటూరు జిల్లాకు బదిలీయ్యారు. బుధవారం ముగ్గురు నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీవో)లో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలి శారు. వారికి పోస్టింగులు కల్పిస్తూ, ఉత్తర్వులు జారీ చేస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

లక్ష్మీపురం: మనస్తాపంతో ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటనపై నగరంపాలెం పోలీసులు బుధవారం రాత్రి కేసు నమోదు చేశారు. నల్లపాడు రోడ్డు భవానీపురం 3వ లైన్‌కు చెందిన అన్యం సీత, భర్త దానయ్యలకు ఒక మగ, ముగ్గురు ఆడ సంతానం ఉన్నారు. వీరందరికి వివాహం అయింది. పెద్ద కుమార్తె జ్యోతికి 2007లో యర్రంశెట్టి వెంకటరావుతో వివాహం అయింది. వారికి ఇద్దరు సంతానం ఉన్నారు. వెంకటరావు కారు డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. వెంకటరావు స్నేహితుడైన శివరారెడ్డి ద్వారా వసుంధర పరిచయం అయింది. ఆమెకు జ్యోతి రూ.2లక్షలు నగదు అప్పుగా ఇచ్చింది. తిరిగి ఇవ్వమని అడిగితే ఇవ్వక పోవడంతో జ్యోతి ఆర్థికంగా ఇబ్బంది పడుతూ మనస్తాపంతో ఇంట్లో బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు జ్యోతి తల్లి దానమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్‌కు పోస్టుమార్టానికి తరలించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పట్నంబజారు: ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) నేతలు బుధవారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిరసన తెలిపారు. ఫ్లెక్సీలు పట్టుకుని తిరుగుతూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎంయూ జిల్లా చైర్మన్ సుబ్బారావు మాట్లాడుతూ తక్షణమే పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, వేతన సవరణ అయిపోయి ఇప్పటికే రెండు సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో ఐఆర్ ప్రకటించాలని కోరారు. గ్యారేజీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎంయూఏ నేతలు అమర్‌నాథ్, పీఎస్ రావు, కె. లక్ష్మయ్య పాల్గొన్నారు.

చనిపోతున్నానంటూ ఫేస్‌బుక్‌లో పోస్ట్

కేసు నమోదు చేసిన పోలీసులు

పట్నంబజారు: ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి తాను చనిపోతున్నానంటూ ఫేస్‌బుక్‌లో పెట్టిన సంఘటనపై కేసు నమోదు అయింది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌత్రా సెంటర్ గంజీబజార్‌లో నివాసం ఉండే వక్కలగడ్డ హరిప్రసాద్ స్వీట్ షాప్ నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆయనకు భార్య ఇద్దరి సంతానం ఉన్నారు. ఈ క్రమంలో తండ్రి ఆస్తి దగ్గర హరిప్రసాద్‌కు అతని సోదరుడు శివనాగేశ్వరరావుకు మధ్య వివాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం హరిప్రసాద్ నుంచి వెళ్లిపోయి, ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. సాయంత్రం అతని ఇంటి ఎదురు వాళ్లకు హరిప్రసాద్ ఫేస్‌బుక్‌లో తాను చనిపోతున్నట్లు వీడియో పోస్ట్ చేశారు. భర్త చనిపోతాడన్న భయం ఉందని, భార్య వెంకట నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

పట్నంబజారు: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకాని రోడ్డులోని పద్మజ పెట్రోలు బంకు వద్ద ముక్కోటి గోపి గంజాయి విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న పోలీసులు దాడిచేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 900 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పొట్లాలు చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.



నీట మునిగిన చుట్టుగుంట రైతుబజార్



కంకరగుంట ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ జామ్



ఏటీ అగ్రహారంలో నీట మునిగిన వీధులు

నగరంలో కుండపోత వర్షం

- మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం
- నగరంలో ఎటు చూసిన నీట మునిగిన రోడ్లు, డ్రైయిన్లు, నివాసాలు
- ట్రాఫిక్‌తో స్తంభించిన జన జీవనం

నెహ్రూనగర్: నగరంలో గత రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లు, డ్రెయిన్లు, మార్కెట్లు జలమయంగా మారాయి. లోతట్టు ప్రాంతాల్లోని మూడు వంతెనలు, కంకరగుంట అండర్ పాస్, పట్టాభిపురం, విద్యానగర్, పాతగుంటూరు, లాలాపేట, ప్రగతీనగర్, నందివెలుగు రోడ్డు, ఏటీ అగ్రహారం, బీఆర్ స్టేడియం వద్ద, హౌస్సేన్ నగర్, చంద్రబాబునాయుడు కాలనీ, చుట్టుగుంట, కేవీపీ కాలనీ, కాకాని రోడ్డులోని పలు ప్రాంతాలు నీటమునిగాయి. కొన్ని ప్రాంతాల్లో కరెంట్ కోతల వల్ల నగరవాసులు ఇబ్బందులు పడ్డారు.

కార్పొరేషన్ కార్యాలయంలోకి చేరిన మురుగు నీరు

కార్పొరేషన్ కార్యాలయంలోకే వర్షపు నీరు చేరడంతో చేసేదేమి లేక మోటార్ల సాయంతో వాటిని బెయిల్ అవుట్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో పాటు రైతు బజార్లు, కూరగాయాల మార్కెట్లలోకి నీరు చేరడంతో వ్యాపారస్తులు తీవ్ర అవస్థలు పడ్డారు. దీంతో పాటు కేంద్ర, ప్రభుత్వ కార్యాలయాలు, వేర్ హౌసింగ్‌లు కూడా నీట మునిగాయి.

ట్రా'ఫికర్'తో అవస్థలు

మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. నగరవాసులు వర్షంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శంకర్‌విలాస్ బ్రిడ్జి పడేయడంతో ట్రాఫిక్ అంతా మూడు వంతెనలు, కొత్తపేట, అరండల్‌పేట, కంకరగుంట ఫ్లైఓవర్ మీద ప్రభావం చూపడంతో నగర వాసులు వర్షంలోనే ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవాల్సిన పరిస్థితి నెలకొంది. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. నివాసితులు నీటిని తోడి బయటకు పోసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గడ్డిపాడు వద్ద చెరువు కట్ట తెగి ఇంటి గోడ పడిపోయి ఇళ్లలోకి చేరింది.

పూడికతీయకపోవడం ఒక కారణం?

గుంటూరు నగరంలో 210 కిలోమీటర్ల మేర డ్రైన్లు విస్తరించి ఉన్నాయి. వీటిలో మేజర్ డ్రైన్లు 125.28 కిలోమీటర్లు, మీడియం డ్రైన్లు 67.41, మైనర్ డ్రైన్లు 16.25 కిలో మీటర్లుగా ఉన్నాయి. వర్షకాలానికి ప్రారంభానికి ముందే మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ కింద డ్రెయిన్ల పూడికతీత పనులు రూ.4.78కోట్లతో ప్రారంభించారు. అయితే, కాంట్రాక్టర్లు పైపైన పూడిక తీసి వెళ్లిపోవడం వల్ల ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు నగరంలో పలు ప్రధాన రోడ్లన్నీ జలమయంగా మారుతున్నాయి. పూడికతీత సక్రమంగా చేసి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని నగర వాసులు అభిప్రాయపడుతున్నారు.



వర్షపు నీటిలో ఆర్టీసీ బస్టాండ్



నీట మునిగిన కంకరగుంట ఆయూర్‌బీ

జలమయమైన ఆర్టీసీ బస్టాండ్

పట్నంబజారు: గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ మంగళవారం రాత్రి నుండి కురుస్తున్న భారీ వర్షాలకు జలమయమైంది. గుంటూరు 1, 2 డిపోల పరిధిలోని గ్యారేజీలు నీట మునిగాయి. బస్టాండ్‌లో ఆవరణలో కూడా నీరు చేరటంతో ప్రయాణీకుల రాకపోకలు తగ్గాయి. దీనితో పాటుగా డిపో 1 పరిధిలో ఉన్న రూట్లులో నాలుగు ప్రాంతాల్లో వాగులు పొంగటంతో ఆయా ప్రాంతాల్లో రూట్లు రద్దు చేసిన పరిస్థితి. తాడికొండ వైపు వెళ్ళాల్సిన బస్సులు, మంగళగిరి మీదుగా తిప్పినట్లు అధికారులు తెలిపారు. సచివాలయం, హైకోర్టు, ఇతర కార్యాలయాలకు వెళ్ళే సిబ్బందికి సైతం మంగళగిరి మీదుగానే వెళ్ళినట్లు తెలుస్తోంది. సుమారుగా 50 సర్వీసులకు రద్దు అయి ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ఎంత నష్టం వచ్చిందనేది అంచనా వేయాల్సి ఉందని తెలిపారు.

ప్రజా సమస్యలు పట్టని పాలకులు

పట్నంబజారు: ప్రజా సమస్యలు పట్టని పరిస్థితుల్లో కూటమి పాలకులు, అధికారులు వ్యవహరిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా విమర్శించారు. మంగళవారం రాత్రి భారీగా కురిసిన వర్షానికి అతలాకుతలమైన పలు ప్రాంతాలను బుధవారం ఆమె సందర్శించారు. ముందుగా గడ్డిపాడు సమీపంలోని చెరువుగట్టు తెగిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న ఆమె అక్కడకు చేరుకుని, స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చెరువు గట్టు తెగిపోయి నీరు నివాసాల్లోకి చేరుతోందని స్థానికులు చెప్పటంతో అక్కడ నుండే అధికారులకు ఫోన్ చేసి సమస్యను వివరించారు.

ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ నగరం జలమైన పరిస్థితుల్లో కనీసం అధికారులు, పాలకులు పట్టించుకునే పరిస్థితుల్లో లేకపోవటం సిగ్గుచేటని తెలిపారు. అభివృద్ధి అంటే ఇదేనా.. చంద్రబాబు ? అని సూటిగా ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, అనుబంధ విభాగాల నేతలు, నగర కమిటీ నేతలు, తూర్పు నియోజకవర్గ నేతలు, డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్‌లు పాల్గొన్నారు.

న్యాయవాదులకు నీతి, నిబద్ధతే గీటురాయి

గుంటూరు ఎడ్యుకేషన్: న్యాయవాదులకు నీతి, నిబద్ధతే గీటురాయి కావాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం జేకేసీ కళాశాల రోడ్డులోని జేసీలా కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆలపాటి రాజా మాట్లాడుతూ న్యాయవాద విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులు వృత్తిలో నైపుణ్యాన్ని సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్లకు పట్టాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల పాలకమండలి అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కార్యదర్శి వేమన కుప్పుస్వామి, సంయుక్త కార్యదర్శి డాక్టర్ పి. గోపీచంద్, కోశాధికారి రాయపాటి వెంకట కోటేశ్వరప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. సుధాకర్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినికి పట్టా అందజేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజా

అవయవ దానంపై అవగాహన సదస్సు

గుంటూరు మెడికల్: ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా గుంటూరులోని కిమ్స్ శిఖర హాస్పిటల్‌లో అవగాహన సదస్సు బుధవారం జరిగింది. వైద్యులు డాక్టర్ సూరప్రదీప్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ చిట్టెం లక్ష్మణరావు, డాక్టర్ విష్ణుప్రసాద్, డాక్టర్ ప్రతాప్ మౌళి, డాక్టర్ శరత్‌చంద్ర పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ అవయవ దానంపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అప్పుడే పుట్టినవారు మొదలు, 90 ఏళ్ల వృద్ధుల వరకు చేయవచ్చని తెలిపారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి అవయవదానం ద్వారా నూతన జీవితాన్ని ప్రసాదించవచ్చని చెప్పారు. నేత్రాలు, కిడ్నీలు, లివర్, గుండె, ఇతర అవయవాలు దానం చేయవచ్చని తెలిపారు. జీవన్‌ధాన్‌లో పేర్లు నమోదు చేసుకోవడం ద్వారా అవయవదానం ప్రక్రియ చాలా సులభంగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ప్లకార్డులతో వైద్యులు, సిబ్బంది ప్రదర్శన

ఫేజ్ థెరపీతో రోగి ప్రాణాలు కాపాడారు

ఏపీలో మొట్టమొదటిసారిగా చికిత్స

గుంటూరు మెడికల్: వ్యాధి నియంత్రణకు వాడే యాంటిబయాటిక్స్ పనిచేయక రోగి తీవ్ర అనారోగ్యానికి గురై, ప్రాణాపాయ స్థితిలో తమ వద్దకు వస్తే ఏపీలోనే మొట్టమొదటిసారిగా ఫేజ్ థెరపీ నూతన చికిత్స ద్వారా రోగి ప్రాణాలు కాపాడినట్లు ప్రముఖ ఇన్‌ఫెక్షన్స్ స్పెషలిస్టు, సమిష్ట హాస్పటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (శ్రీ) మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కోగంటి కళ్యాణ్ చక్రవర్తి చెప్పారు. బుధవారం అరండల్‌పేటలోని శ్రీ హాస్పటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో అరుదైన చికిత్స విధానం గురించి మీడియాకు వివరించారు. బాపట్ల జిల్లా ఈదులపల్లికి చెందిన 72 ఏళ్ల ప్రభావతి థైరాయిడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు చెప్పారు. క్యాన్సర్ కుడి తుంటికి సోకి బోన్ పూర్తిగా దెబ్బతిందన్నారు. వైద్యులు కుడి తుంటికి శస్త్రచికిత్స చేసి ఇంప్లాంట్ అమర్చారన్నారు. ఇన్‌ప్లాంట్ అమర్చిన అనంతరం తీవ్రంగా ఇన్‌ఫెక్షన్ సోకి ఆపరేషన్ జరిగిన ప్రదేశంలో గాయం మానక తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ఆరునెలలుగా ఇంట్లో మందులు వాడినా గాయం మానకపోగా, విచ్చలవిడిగా యాంటి బయాటిక్స్ వాడడం వల్ల రక్తం శాతం తగ్గిపోయి, పల్స్ లేక అపస్మారక స్థితిలో తమ ఆసుపత్రికి జనవరిలో వచ్చిందన్నారు. యాంటి బయాటిక్స్ విచ్చలవిడిగా వాడడం వల్ల మందులు పనిచేయడం లేదని నిర్ధారించి, ఆమె శరీరంలో యసినికో బ్యాక్టీరియా ఉన్నట్లు నిర్ధారించామన్నారు. బెనారస్ విశ్వవిద్యాలయానికి చెందిన గోపాల్‌నాథ్ ఫేజ్‌లు పంపించడం ద్వారా తాము ఈ ఏడాది జనవరి 26న ప్రభావతి గాయాన్ని ఓపెన్ చేసి, శరీరంలోకి ఫేజ్–1 పంపించామన్నారు. ఒక సారి ఫేజ్ థెరఫీ చేసి, మూడు రోజులపాటు ఆసుపత్రిలో ఉంచి మరలా వారం తరువాత రెండో సారి ఫేజ్ థెరఫీ చేశామన్నారు. కేవలం రెండు సార్లు ఫేజ్ థెరఫీ ద్వారా రోగిని తాము బతికించడం గర్వంగా ఉందన్నారు. సమావేశంలో డాక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.



వృద్ధురాలితో డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ రామకృష్ణ

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

పట్నంబజారు: విద్యుత్ షాక్ కొట్టి వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రైలుపేటలోని గాంధీ విగ్రహం వద్ద శంకరమంచి వారి వీధిలో నివాసం ఉండే రావూరి హరిప్రసాద్ (49) జీఎంసీలో గ్యాంగ్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం ఇంట్లోని మోటార్ స్విచ్ వేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. కుటుంబ సభ్యులు హడావుడిగా ఆసుపత్రికి తీసుకుని వెళ్లేసరికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దేశ వ్యవసాయ రంగాన్ని కాపాడాలి

లక్ష్మీపురం: కార్పొరేట్ల కబంధ హస్తాల నుంచి దేశ వ్యవసాయ రంగాన్ని కాపాడాలని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి ప్రసాద్ అన్నారు. కార్పొరేట్ సంస్థలను భారత దేశ వ్యవసాయ రంగంలో చొరబడే విధంగా చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా గుంటూరు లాడ్జి సెంటర్ నుంచి నిరసన ర్యాలీని రైతు సంఘ జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ అమెరికా షరతులు అంగీకరిస్తే మనం సమృద్ధిగా పండించుకునే గోధుమ, వరి, మొక్కజొన్న వంటి ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకోవలసి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రైతు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మహా సభలు జయప్రదం చేయాలి

లక్ష్మీపురం: సీపీఐ గుంటూరు జిల్లా 26వ మహాసభలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ హమాలీ(ముఠా) వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు తెలిపారు. స్థానిక నగర ముఠా కార్మిక సంఘం కార్యాలయం రేగుల రాఘవయ్య భవనంలో జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లా సివిల్ సప్లయీస్ కమిటీ సమావేశానికి కట్టా బాబూరావు (ప్రత్తిపాడు) ముఠా మేస్త్రి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహించగలిగిన ఏకైక ప్రజల పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని తెలిపారు. సమావేశ అనంతరం జిల్లా మహాసభల వాల్ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కోట్ల మరియదాసు, మారం వెంకటేశ్వరరెడ్డి, అశోక్ రెడ్డి, కె.పుసిబాబు, పి. మల్లయ్య, సురేష్, రమేషు, గోపి, బొంత అశోక్, చౌటుపల్లి ఏలియా, బొంత నాగేశ్వరరావు, టి. ప్రసాదు, గోపీకృష్ణ పాల్గొన్నారు.

జిల్లాకు మేటి అథ్లెటిక్స్‌ను అందించాలి

అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్

లక్ష్మీపురం: గుంటూరు జిల్లాకు మేటి క్రీడాకారులను తయారు చేసేందుకు కృషి చేయాలని, అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ తెలిపారు. గుంటూరుకు చెందిన రమావత్ పవన్ కల్యాణ్ నాయక్ అథ్లెటిక్స్ శిక్షణలో ఎన్ఎస్ఎన్ఐఎస్ సర్టిఫికెట్ కోర్స్ బెంగళూరులో పూర్తి చేసుకొని గుంటూరుకు బుధవారం వచ్చిన సందర్భంగా అథ్లెటిక్ సంఘం సభ్యులు నాయక్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు జిల్లా నుంచి క్రీడాకారులతో పాటు కోచ్‌లు కూడా అధిక సంఖ్యలో తయారై, అనేకమంది క్రీడాకారులను రాష్ట్ర, జాతీయ పోటీలకు సిద్ధం చేస్తున్నారని తెలిపారు. గుంటూరు జిల్లాకు అథ్లెటిక్స్‌లో జాతీయస్థాయిలో ఉన్న పేరు ప్రఖ్యాతలను ప్రతి క్రీడాకారుడు నిలబెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్ కోచ్ రామకృష్ణ, భాష్యం నాని, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వి.నాగరాజు పాల్గొన్నారు.



అథ్లెటిక్ కోచ్ రమావత్ పవన్ కళ్యాణ్ నాయక్‌ను అభినందిస్తున్న జీవీఎస్ ప్రసాద్, కోచ్ రామకష్ణ,

నల మహారాజు గొప్ప పాలకుడు

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం పద్మావతి కళ్యాణ వేదికపై నలమహారాజు వైభవంపై బుధవారం ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఆలయ పాలకమండలి కమిటీ జ్యోతి ప్రజ్వలన చేసింది. డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి ప్రసంగిస్తూ నలమహారాజు గొప్ప పాలకుడు, వీరుడని అన్నారు. ఈ కథ మహాభారతంలో ఒక ముఖ్యమైన భాగమని పేర్కొన్నారు. ప్రేమ, అదృష్టం, విధి ఇతివృత్తాల చుట్టు తిరుగుతుందని చెప్పారు. నలుడి వైభవం అతని పరాక్రమం, న్యాయం, దయతో కూడిన పాలనలో వ్యక్తమవుతుందని వివరించారు. అతను జూదంలో రాజ్యాన్ని కోల్పోయి, అడవుల్లో కష్టాలు అనుభవించాల్సి వచ్చిందని తెలిపారు. అయినప్పటికీ అతను దమయంతితో తిరిగి కలిసి, తన రాజ్యాన్ని తిరిగి పొంది అతని వైభవాన్ని చాటుకున్నాడని వివరించారు.



ప్రసంగిస్తున్న కోగంటి శ్రీవెంకట శ్రీరంగనాయకి

PUBLICATION

IN THE COURT OF THE HON'BLE II ADDL. DI STRICT JUDGE
R.R. DISTRICT:: AT : L.B. NAGAR
E.P. No. 52 OF 2025
IN
OS No.88 OF 2002

Between:
M/s. Deepak Real Estate Enterprises LLP & another
...Assignee Decree Holder/Decree Holder
AND
Debbad Vishweshwara Rao and others
... Judgment-Debtors

To,
1. Karnati Vijayalakshmi, W/o. Dr. K.Govinda Reddy, R/o. FF-3, Siddhartha Apartments, 5th Lane, Pandaripuram, Guntur.
2. Veeram Reddy Anjamma, W/o. V.Obul Reddy, R/o. Kothapet, Vinukonda, Guntur District.

... Judgment Debtor No.5 and 7

Whereas, the Assignee Decree Holder has filed above EP No.52/2025 before the Hon'ble II Addl. District Judge, R.R. District at L.B. Nagar for execution of decree passed in Review Petition (C) No.1565/2022 in Civil Appeal No.5822/2022 dt.08.11.2024. This is to give you notice that you are to appear before the Hon'ble II Addl. District Judge, R.R. District at L.B. Nagar on **22.08.2025 at 10.30 AM,** to show cause why execution should not be granted in favour of above Assignee Decree Holder.

Given under the hand and seal of this Court on this the 13thday of August, 2025.

(By order of the Court)
Sd/-**MOHAN RAO**
Advocate
RAO & CO.LAWYERS
office at: 3-6-442/A,St.No.5, Himayath Nagar, Hyderabad.

PUBLICATION

IN THE COURT OF THE HON'BLE II ADDL. DISTRICT JUDGE R.R. DISTRICT:: AT : L.B. NAGAR
EA No.24 OF 2025
IN
E.P. No. 52 OF 2025
IN
OS No. 88 OF 2002

Between:
M/s. Deepak Real Estate Enterprises LLP
...Petitioner/Assignee Decree Holder
AND
Siddamsetty Infra Projects Pvt. Ltd and others
...Respondents/Decree Holder/Judgment-Debtors

To,
1. **Karnati Vijayalakshmi, W/o. Dr. K.Govinda Reddy, R/o. FF-3, Siddhartha Apartments, 5th Lane, Pandaripuram, Guntur.**
2. **Veeram Reddy Anjamma, W/o. V.Obul Reddy, R/o. Kothapet, Vinukonda, Guntur District.**

...Respondent No.6 and 8/Judgment Debtor No.5 and 7

Whereas, the Assignee Decree Holder has made application EA No.24/2025 in EP No.52/2025 before the Hon'ble II Addl. District Judge, R.R. District at L.B. Nagar for execution of decree passed in Review Petition (C) No.1565/2022 in Civil Appeal No.5822/2022 dt.08.11.2024, stating that the said decree has been transferred to them by way of registered Deed of Assignment vide doct.No.89/2025 dt.30.06.2025. This is to give you notice that you are to appear before the Hon'ble II Addl. District Judge, R.R. District at L.B. Nagar on 22.08.2025 at 10.30 AM, to show cause why execution should not be granted in favour of above Assignee Decree Holder.

Given under the hand and seal of this Court on this the 13th day of August, 2025.

(By order of the Court)
Sd/-MOHAN RAO, Advocate
RAO & CO.LAWYERS , office at: 3-6-442/A,St.No.5, Himayath Nagar, Hyderabad.